చచ్చిపోదు, కదలకుండా వలలో ఉంటుంది. అలాగే నువ్వు ప్రాణాయామాలు, యోగాభ్యాసాలు చేసి మనస్సుని అణిచిపెట్టి ఉంచినప్పటికీ మళ్ళీ అభ్యాసం వదిలేస్తే మనస్సు విజృంభిస్తూ ఉంటుంది. అది సరిపోదు. మనోనాశనం అవ్వాలి, వలలో పక్షి ఉండటం వేరు, పక్షి చనిపోవటం వేరు. పక్షి చనిపోతే వల తీసినా అది ఎగరదు. మనస్సు అణిగినవాడికి సత్యదర్శనం అవ్వదు. మనోనాశనం అయినవాడికి సత్యదర్శనం అవుతుంది.

మీకు ఎన్ని సంపదలు ఉన్నా ఎగిరి, ఎగిరి పడకూడదు. అణిగి ఉండాలి. వినయమే నిజమైన సంపద. అక్కడికే జ్ఞానం చేరుతుంది. నువ్వు వెదికే వస్తువు ప్రపంచములో లేదు, నీ హృదయములో ఉంది. నువ్వు ఏ రూపాన్ని ఆరాధించినా, ఏ యోగంలో ప్రయాణం చేసినా నీ హృదయంలోనికి నువ్వు చేరుకోవాలి. నీ మనస్సుని నిర్మలం చేసి, దానిని మధురం చేసి, నీ మనస్సుని నువ్వు అనుకూలంగా చేసుకుంటేగాని అది అసలు హృదయం వైపుకు ప్రయాణం చెయ్యదు. మీరు సాధన చేస్తున్నట్టు మీకు గుర్తు ఏమిటి అంటే మీ ఇంద్రియాలు, మీ మనస్సు మిమ్మల్ని బాధపెట్టకూడదు. బయట పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మన మనస్సు మీద పడకుండా చూచుకోవాలి. అప్పుడు మీరు సాధన చేస్తున్నట్టు.

మూసుకుపోయిన జ్ఞానమార్గాన్ని ఓపెన్ చేయటానికి వచ్చిన గురువు రమణమహర్షి. ఒకవేళ చెడ్డ ప్రారబ్ధం మిమ్మల్ని తరుముతున్నప్పటికీ, ప్రారబ్ధం ఎవరికి? శరీరానికి మాత్రమే. మంచి ప్రారబ్ధం అయినా శరీరానికే, చెడ్డ ప్రారబ్ధం అయినా శరీరానికే. జ్ఞానాగ్ని వల్ల దేహబుద్ధి ఎప్పుడైతే కాలిబూడిద అయిపోయిందో, మీ శరీరం ఎంత చెడ్డ ప్రారబ్ధం అనుభవిస్తున్నప్పటికీ మీకు దుఃఖ స్పర్శ రాదు. అదే రమణానుగ్రహం. నీ దేహం ప్రారబ్ధం ఎలా అనుభవిస్తున్నప్పటికీ, దేహం నువ్వు కాదు అనే బుద్ధి నీకు వచ్చినప్పుడు, దేహబుద్ధి నశించినప్పుడు నువ్వు ఎంత చెడ్డ ప్రారబ్ధం అనుభవిస్తున్నా నీకు ఎర్రచీమ కుట్టినట్టు కూడా ఉండదు. అదీ రమణ సిద్ధాంతం. అక్కడికి మన కళ్ళు తెరిపించటానికి వచ్చిన అవతారమే రమణావతారం.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 08-12-2011, అరుణాచలం)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజున మనందరం ఇక్కడ సమావేశం అవ్వటానికి కారణం సాయంత్రం 6

గంటలకు ఇక్కడ మహాజ్యోతి ప్రజ్వలన చేస్తారు కాబట్టి, ఆజ్యోతిని మన నేత్రాలతో దర్శించి నేత్రానందం పొందటానికి ఇక్కడకు వచ్చాము. ఇక్కడ కనిపించే కొండ మనకు రాళ్ళగుట్ట కింద కనిపిస్తోంది కాని అది రాళ్ళగుట్ట కాదు, అది జ్ఞానగిరి. అరుణాచలంలో ముందు గుడికంటే ఈ గిరికే ఎక్కువ ప్రాముఖ్యత ఉంది. ముందు గిరి, తరువాత లింగం. దేవతల కోరిక మీద పరమేశ్వరుడు ముందు ఇక్కడ గిరిగానే అవతరించాడు. ఇంత పెద్ద కొండను మేము ఎలా ఆరాధించటం అంటే అప్పడు లింగరూపం ధరించాడు. శివుడికి మూడు నేత్రాలు, మూడో నేత్రం జ్ఞాననేత్రం, జ్ఞాననేత్రమే ఈగిరిరూపం ధరించింది. మీరు శ్రద్ధతో, భక్తితో గిరిప్రదక్షిణ చేసినా, గిరిని ధ్యానం చేసినా మీరు ఊహించనటువంటి అద్భుతాలు జరుగుతాయి. మీకు ఉన్న ఇబ్బందులను తొలగించమని కూడా ఈ గిరిని ప్రార్థించవచ్చు. ఆయన కరుణామయుడు, జీవకోటిని అనుగ్రహించటానికే ఇక్కడ వెలిసాడు. ఈ కొండ హిమాలయ పర్వతాలకంటే పురాతనమైనది. యిక్కడకు వచ్చిన వారు, ఈ గిరిని దర్శించిన వారు, గిరిప్రదక్షణచేసిన వారు అదృష్టవంతులు. అయితే ఆ అదృష్టం మీ కళ్ళకు కనబడదు, మీ చెవులకు వినబడదు, మీ బుద్ధికి అందదు కాబట్టి అన్ని యాత్రలకు వెళ్ళినట్లే ఏదో వెళ్ళాం, వచ్చాం, చూసాము అని మీకు అనిపిస్తుంది.

మనం ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే ముందుగా ఆడంబరంగా మాట్లాడటం, ఆడంబరంగా ఆలోచించటం వదులుకోవాలి. ఈ గిరి అంత నిరాడంబరుడు ఎక్కడా మనకి కనబడడు. ఆడంబరం ఎలా ఉంటుందో ఆయనకు తెలియదు. మనకు భౌతికంగాకాని, ఆధ్యాత్మికంగా కాని ఏదైనా సహాయసహకారములు అందించినా ఎంతో రహస్యంగా మన ప్రక్కన ఉన్నవాడికి కూడా తెలియకుండా మనలను అనుగ్రహిస్తాడు. వేదాల సారం ఏమిటంటే చీకటిలో ఉన్న నన్ను మహావెలుతురులోనికి తీసుకొని వెళ్ళు అంటే అజ్ఞానంలో ఉన్న నన్ను జ్ఞానంలోనికి తీసుకొని వెళ్ళు, ఎన్ని వేదాలు చదివినా ఇదే సారం. ఆ సారాన్ని అనుగ్రహించేవాడే అరుణాచలేశ్వరుడు. కేవలం అరుణాచలేశ్వరుని అనుగ్రహం వలననే రమణమహర్షిగారు ఒక్కసారిగా అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి జంప్ చేసారు. ఆయనకు టీనేజ్‌లోనే మరణానుభవం కలిగింది, మృత్యువులో నుండి అమృతత్వం పొందాడు. అది ఎలా జరిగింది అంటే అది దేవరహస్యం. ఈ కొండ చేసే పని ఏమిటి అంటే మీలో

ఏమైనా దోషాలు ఉంటే అవి ఉన్నాయి అని చెప్పకుండా ఆ దోషాలలో నుండి మిమ్మల్ని విడుదల చేస్తుంది. మీ తల్లితండ్రులు మీకు ఏమైనా సహాయం చేస్తే మిమ్మల్ని ఉద్ధరించాము, మా వలననే మీరు బాగపడ్డారు అని చెపుతూ ఉంటారు. కాని ఈయన అలా చెప్పడు. అక్షరమణమాలలో భగవాన్ అంటారు నీయొక్క ఔన్నత్యం లోకానికి తెలియదు, ఇతరులకు నీ ఔన్నత్యం గురించి చెబుదామంటే అలా చెప్పటం నీకు యిష్టం ఉండదు. అక్షరమణమాలలో నీ ఔన్నత్యం గురించి చెబుతున్నందుకు, నీకు ఇష్టంలేని పని చేస్తున్నందుకు నన్ను క్షమించి, ఆశీర్వదించు అరుణాచలేశ్వరుడా అన్నారు భగవాన్.

అక్షరమణమాల అంటే అక్షరములతో తయారుచేసిన పెండ్లినాటి మాల. ఇక్కడ అరుణాచలేశ్వరుడు పెళ్ళికుమారుడు, రమణమహర్షి పెండ్లికుమార్తె. ఈ పెళ్ళికుమార్తె ఏమని చెపుతోంది అంటే అక్షరాలతో తయారుచేసిన ఈ మాలను నీ మెడలో ధరింపచేస్తున్నాను, నీ అనుగ్రహం అనే దండను నామెడలో వేసి ఆశీర్వదించి, నీలో ఐక్యం చేసుకో అని చెపుతోంది. యిది అక్షరమణమాల సారం. ఈ గిరి చేసేపని ఏమిటి అంటే మీలో ఏమైనా దోషాలు ఉంటే ఆ దోషాలకు నిప్పు పెడుతుంది, అది మీకు తెలియదు. అరుణాచలం వెళ్ళి వచ్చాము బాగానే ఉంది అని మీరు అనుకొంటారు. లోపల జరిగేది మీకు తెలియదు. మీలో ఉన్న బలహీనతలకు నిప్పు పెట్టి , దాని వలన వచ్చే బాధను తట్టుకొనే శక్తిని కూడా ఆయనే ప్రసాదిస్తాడు. సాధనలో ఎంతోకొంత సఫరింగ్ ఉంటుంది. అందుచేత ఆ సఫరింగ్‌ను తట్టుకొనే శక్తిని ప్రసాదించి, మీలో ఉన్న బలహీనతలను పోగొట్టి తరువాత మిమ్మల్ని ఆయనలో ఐక్యం చేసుకొంటాడు. మీరు అరుణాచలం వచ్చి గిరిని దర్శించటం వలన, గిరి ప్రదక్షిణ చేయటం వలన, మహాజ్యోతిని దర్శించటం వలన వచ్చే లాభం మేము మాటలతో చెప్పలేము, అది యింద్రియాలకు అతీతమైన విషయం. ఆయన జ్ఞానగిరి, భగవాన్ ఏమన్నారు అంటే నేను పెద్దపండితుడిని కాదు. అక్షరమణమాలలో నీ గురించి నాలుగు మాటలు చెప్పాను. పెద్ద పెద్ద పండితులు చెప్పిన కవిత్వాలు శ్రవణం చేసిన నువ్వు, నీ యందు భక్తితోటి, ప్రేమతోటి నేను చెపుతున్న ఈ చిన్నపాటి కవిత్వాన్ని కూడా విని, నన్ను ఆశీర్వదించి నీ దయకు పాత్రునిగా చెయ్యి అరుణాచలా అన్నారు భగవాన్.

మాకు మోక్షం ఎక్కడనుండి వస్తుంది అని మీరు ఎవరూ అనుమానపడవద్దు.

మానవుడికి అసాధ్యం ఉంది కాని భగవంతుడికి అసాధ్యమంటూ ఏమీ లేదు. మనకు ఏది మంచిదో మనకంటే భగవంతుడికే బాగా తెలుసు. సిద్ధపురుషులు, దేవతలు రోడ్డుకు కుడి ప్రక్క నుండి గిరిప్రదక్షిణచేస్తారు. వారికి మనం అడ్డులేకుండా మనం ఎడమ ప్రక్కనుండి చేయటం మంచిది. గిరి ప్రదక్షిణచేసేటప్పుడు రెండుమూడురోజులలో పురుడు వచ్చే అమ్మాయి ఎంత స్లోగా నడుస్తుందో అంత నెమ్మదిగా నడవాలి. గిరిప్రదక్షిణ చేసేవారు లౌకిక విషయాలు ఏమీ మాట్లాడకుండా, సంసారం గొడవలు ఏమీ చెప్పకోకుండా కేవలం అరుణాచలేశ్వరుడిని మనసులో స్మరించుకొంటూ ప్రదక్షిణం చేయాలి. మీరు పదిమంది కలసి వెళ్ళినా లోక విచారణ చేస్తూ కాకుండా ఆత్మవిచారణ చేసుకొంటూ ప్రదక్షిణం చేయాలి. మీరు ఇక్కడ జాగ్రత్తపడవలసింది ఏమిటి అంటే ప్రదక్షిణ చేసేటప్పుడు మీకు ఏమైన కోరికలు ఉంటే కోరుకోవచ్చు కాని అప్పడు ఆయన అనుగ్రహం ఆ కోరికకే పరిమితం అవుతుంది. మీరు ఏమీ కోరుకోకుండా మీ మనస్సును నిర్మలంగా, నిశ్చలంగా ఉంచుకొని ప్రదక్షణ చేస్తే, ఆయనను స్మరించుకొంటూ ప్రదక్షిణ చేస్తే మీకు అన్నీ యిస్తాడు, మోక్షం కూడా ఇస్తాడు.

అరుణాచలేశ్వరుడి యొక్క వైభవం పురాణాలలో ఉంది అని చాలామంది అంటున్నారు. యిది కేవలం పురాణాలకే పరిమితం కాదు, వేదాలలో కూడా దీని వైభవం వర్ణించారు. వ్యక్తిభావనను, అహంభావనను అణచటానికి వచ్చిన క్షేత్రం యిది. బ్రహ్మదేవుడు, విష్ణుదేవుడు నేను గొప్ప, నేనుగొప్ప అని అనుకొంటూ ఉంటే వారి అహంభావనను అణచటానికి మొదట జ్యోతిరూపంలో దర్శనమిచ్చి, తరువాత రూపాలు మార్చి గిరిరూపం ధరించాడు. బ్రహ్మదేవుడికి, విష్ణుదేవుడికి ఏరోజున అయితే జ్యోతిరూపంలో దర్శనమిచ్చాడో దానికి గుర్తుగా ఆ రోజునే ఇక్కడ కొండపైన మహాజ్యోతిని వెలిగిస్తారు.

**అరుణాల మనుచు స్మరియించువారల**

**అహము నిర్మూలింపు మరణాచలా!**

కాశీలో మరణిస్తే ముక్తి, చిదంబరాన్ని దర్శిస్తే ముక్తి, తిరువాయూర్‌లో జన్మిస్తే ముక్తి అంటారు. అరుణాచలం విషయంలో అలాకాదు. అరుణాచల, అరుణాచల అని స్మరిస్తేచాలు నీకు ముక్తి కలుగుతుంది. అరుణాచలం దీనిని జ్ఞానపంచాక్షరి అంటారు. అరుణాచలాన్ని స్మరించగా, స్మరించగా మీరు పవిత్రులవుతారు, ఆయన అనుగ్రహం వలన మీకు ముక్తి

కలుగుతుంది.

పరమాత్మ జ్ఞానస్వరూపుడు, తేజోస్వరూపుడు, అనుగ్రహస్వరూపుడు. పరమాత్మ ఎవడికి తెలియబడాలి అనుకొంటాడో వాడికి మాత్రమే ఆయన తెలియబడతాడు కాని నాకు తెలియబడాలి అని నువ్వు అనుకొంటే ఆయన నీకు తెలియబడడు. నీకు అర్హత ఉంటే, యోగ్యత ఉంటే ఆయన అంతట ఆయనే నీకు తెలియబడతాడు. మన యింద్రియాలతో గాని, మనస్సుతో గాని, బుద్ధితో గాని ఆయనను పట్టుకోలేము. మన ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి ఎక్కడైతే అణిగిపోయాయో అక్కడ ఆయన తెలియబడతాడు. అయితే మహా వెలుగు ఎక్కడైతే ఉందో అక్కడకు వీటినన్నింటిని ఫోకస్ చేయలేకపోతున్నాము. మన అస్థిత్వం దేహానికి పరిమితమై ఉంటుంది. ప్రతీవాడికి వాడి దేహం అంటే వాడికి బాగా ఇష్టం. దేహం పుట్టినప్పడు నేను పుట్టాను అనుకొంటున్నాడు, దేహం చనిపోయినప్పడు నేను చనిపోతున్నాను అనుకొంటున్నాడు. గాఢనిద్రలో మీకు దేహం గొడవలేదు, దేవుడు గొడవ లేదు, ప్రపంచం గొడవలేదు, కాని మీరు ఉన్నారా లేదా అంటే మీరు ఉన్నారు, అక్కడ సుఖంగా ఉన్నారు. మన దేహం అంటే మనకు ఎంత ఇష్టం అయినా గాఢనిద్రలో దేహం తాలూక తలంపు లేనప్పడు మనం సుఖంగానే ఉన్నాము. మరి దేహం నువ్వు అయితే గాఢనిద్రలో దేహాన్ని ఎందుకు విడిచిపెట్టి ఉంటున్నావు. నిద్రపోవటానికి ఎవడూ భయపడడు, చావు అంటే అందరికీ భయం. నిద్రపోయినా ఒక్కటే, చనిపోయినా ఒక్కటే. రెండూ సమానమే. నిద్రపోయిన వాడికి దేహం కనబడదు, చనిపోయిన వాడికీ దేహం కనబడదు. నిద్రపోయే వాడికి రేపు మెలుకువ వచ్చాక మన దేహం మనకు ఉంటుంది అనే తలంపు వలన వాడికి భయంలేదు. చనిపోయేవాడికి ఇంక మన దేహం కనబడదు అనే తలంపు వలన వాడికి భయం కలుగుతోంది. ఈ రెండింటికి తలంపులే కారణం. దేహం నిద్రపోయిన తరువాత నువ్వు ఎలా ఉంటావో, దేహం చనిపోయిన తరువాతకూడా నువ్వు ఉంటావు, కాని ఉంటాము అని మనకు తెలియదు. ఉండము అని అనుకొంటాము. ఆ తలంపు వలన అశాంతి నిన్ను వెంటాడుతోంది. గాఢనిద్రలో మీకు నేను ఉంది కదా. దానికి దేహం లేదు. అసలు దేహమే లేనప్పడు ఇంక చావు ఏమిటి? మీరు గాఢనిద్రలో ఏ స్థితిలో ఉన్నారో జాగ్రదవస్థలోకూడా ఆ స్థితిలోనికి మిమ్మల్ని మేల్కొలపటానికి అరుణాచలేశ్వరుడు రహస్యంగా

పనిచేస్తున్నాడు. అయితే మనకు ఉన్న వాసనలు, సంస్కారాలు, రాంగ్‌తింకింగ్ వలన ఇది మనకు అర్థంకాదు. రాంగ్‌తింకింగ్ వలన ఆయన అనుగ్రహం ఉన్నా అది మనకు తెలియదు. అందుచేత సాధన చేసి రాంగ్‌తింకింగ్‌లోనుండి, వాసనలలో నుండి ముందు బయటకు రావాలి.

**కుట్రమంతయు గోసి గుణముగా పాలించు**
**గురురూపమై వెలుగు అరుణాచలా**

ఓ అరుణాచలేశ్వరుడా! నాకు నువ్వే గురువువి, నువ్వే దేవుడివి, నువ్వే డాక్టరువి, నువ్వే మందువి, అన్నీ నువ్వే. నిన్ను తెలుసుకోవటానికి నాలో ఉన్న కుట్ర ఏదైతే అడ్డు వస్తోందో దానిని నీ అనుగ్రహంతో తొలగించి మంచిగుణాలతో నన్ను అలంకరించు. మంచిగుణం జ్ఞానం కాకపోయినా జ్ఞానం పొందటానికి అది సహకరిస్తుంది. మేము బుద్ధిమంతులం, మేము బుద్ధిమంతులం అని మనందరము అనుకొంటున్నాము. మన లోపల ఉన్న కుట్ర తలంపు రూపంలోనికి వచ్చే వరకూ అది ఉన్నట్లు కూడా మనకు తెలియదు. నాలో ఏమైనా చెడుగుణాలు ఉంటే నీలో చెడుగుణాలు ఉన్నాయి అని బయటకు పొమ్మనక ఆ చెడుగుణాలను సరిచేసి నీ దయతో వాటిని తొలగించు.

భగవంతుడు లేడు అని చెప్పేవారు కూడా ఏదో శాంతికోసం ఈ గిరి చుట్టూ తిరిగే వారు ఉన్నారు ఎందుచేతనంటే వారికి కూడా శాంతి కావాలి కదా. ఈ అరుణాచలంలో ఉన్నంతకాలం మీరు కూడా సాధ్యమైనంతవరకు ఈ గిరిని చూస్తూ కూర్చోండి. అవకాశం ఉంటే గిరి ప్రదక్షిణ చేయండి. మీరు శరీరాన్ని బిగపెట్టేయనక్కరలేదు. మామూలుగా సుఖంగా కూర్చొని గిరిని చూస్తూ ఉండండి. నేచురల్‌గా, నార్మల్‌గా అలా కొండవంక చూస్తూ ఉంటే అది చేసే పని అది చేసుకొనిపోతుంది. ఇప్పుడు మీరు నావంక చూస్తున్నారు, నేను మీవంక చూస్తున్నాను. ఇందులో స్ట్రెయిన్ ఏముంది? అలాగే గిరిని చూడండి సరిపోతుంది. ఇంటికి వెళ్లిన తరువాత ఆ రూపాన్ని గుర్తుకు తెచ్చుకొంటూ ఉండండి. ఆ నామాన్ని స్మరించుకొంటూ ఉండండి. తప్పిపోయిన గొర్రెలు అంటే నాకు ఇష్టం అంటాడు ఏసు. అంటే ఎవడైనా మోక్షమార్గం తప్పిపోయినా వాడిని పట్టుకొని సరిచేసి మరలా మోక్షమార్గంలో పెట్టటానికి చూస్తానని చెప్పటానికి అలా చెప్పాడు. ప్రతీ మనిషికి ఎంతో

కొంత పిచ్చి ఉంటుంది. రామకృష్ణపరమహంస ఏమని చెప్పారు అంటే ఈ కలకత్తా నగరంలో చాలామంది నన్ను పిచ్చివాడు అంటున్నారు. వారుకూడా పిచ్చివారే, నాకు దేవుడి మీద పిచ్చి కలిగింది, వారందరికి లోకంమీద పిచ్చి ఉంది. అందుచేత వారు పిచ్చివారే, నేను పిచ్చివాడినే అని చెప్పారు. అక్షరమణమాలలో భగవాన్ ఏమన్నారు అంటే ఓ అరుణాచలేశ్వరుడా లోకం మీద నాకు ఉన్న పిచ్చిని పోగొట్టటానికి నీ మీద పిచ్చిని కలిగించావు. నీమీద నాకు ఉన్న పిచ్చిని కూడా పోగొట్టి నీలో ఐక్యం చేసుకో అన్నారు. భగవాన్‌కు అరుణాచలం అంటే ఎంత ఇష్టం అంటే ఆయన అరుణాచలం వచ్చి ఇక్కడ 54 సంవత్సరాలు సంచారం చేస్తే, ఈ అరుణాచలాన్ని విడిచిపెట్టి ఎక్కడికైనా వెళ్ళాలని తలంపుకూడా ఎప్పడూ రాలేదు అన్నారు భగవాన్. అంటే అరుణాచలేశ్వరుడిపట్ల ఆయనకు ఉన్న ప్రేమ అట్టిది. అంటే అరుణాచలేశ్వరుడే రమణరూపంలో వచ్చి అక్కడ సంచరించి మనకు ఆత్మజ్ఞానం గురించి బోధించాడు.

ఇప్పడు చాలామంది పండితులు ఏమనుకొంటున్నారు అంటే వారికున్న పాండిత్యమే జ్ఞానం అనుకొంటున్నారు, ఇది చాలా ప్రమాదం. పాండిత్యానికి, జ్ఞానానికి ఏమీ సంబంధం లేదు. డబ్బుకీ జ్ఞానానికీ ఏమీ సంబంధం లేదు. పాండిత్యం అనేది, ధనం అనేది లౌకిక విషయాలు . పాండిత్యం అనేది మనస్సుతో సంపాదించేదే కాని అది నిజం కాదు. వయస్సు పెరిగేకొలది ఎంత పండితుడు అయినా ఆ పాండిత్యం అంతా మరిచిపోతాడు. ధనం కూడా నిజం కాదు కాబట్టి మనం ధనం సంపాదించినా అది ఏదో తరంలో పోతుంది. ఈ ప్రపంచంలో ఉన్న మాయ అంతా ధనంలో పెట్టాడు అని వాల్మీకి చెప్పాడు. మన కుటుంబాలలో కూడా ధనం గురించే పేచీలు, ధనం వలన మానవతాసంబంధాలు చెడిపోతున్నాయి. నిప్ప కాలుతుంది అని మనకు తెలిసినా తెలియకపోయినా నిప్పను ముట్టుకుంటే కాలుతుంది అది దాని స్వభావం. అలాగే అరుణాచలేశ్వరుడి యొక్క ఔన్నత్యం, జ్ఞానగిరి యొక్క వైభవం మీకు తెలిసినా తెలియకపోయినా ఆ రూపాన్ని ధ్యానించటం వలన, ఆయన నామాన్ని స్మరించటం వలన అది చేయవలసిన పని సైలెంట్‌గా చేసేస్తుంది, అది నీకు తెలియదు. మీకు ఏ తలంపు వచ్చినా, ఏ ఆలోచనవచ్చినా, మీరు ఏ పని చేస్తున్నా, ఏ మాట మాట్లాడుతూ ఉన్నా అది అరుణాచలేశ్వరుడు చూస్తున్నాడు అనే భావన విడిచిపెట్టకండి. ఎందుచేతనంటే

ఆయన మనలో అంతర్యామిగా ఉన్నాడు కాబట్టి ఇది అంతా ఆయన చూస్తాడు.

రామకృష్ణుడి దగ్గరకు ఎంత పెద్ద ధనవంతులు వచ్చినా, పండితులు వచ్చినా, పేరు ప్రఖ్యాతులు ఉన్నవారు వచ్చినా ఈ బాహ్యవిషయాలను ఆయన ఎప్పుడూ చూసేవారు కాదు, వారి హృదయం ఎలా ఉంది అని చూసేవారు. మీరు ధనవంతులే, పండితులే కాని హృదయంలో దేనిని ఆరాధిస్తున్నారు. నీకు డబ్బు ఉన్నమాట నిజమే, పాండిత్యం ఉన్న మాట నిజమే ఇవి అన్నీ పైన ఉన్నటువంటి మెరుపులు. దీనికి జ్ఞానానికి ఏమీ సంబంధం లేదు. నీకు ఉన్న చదువుతోటి, అధికారంతోటి, ధనంతోటి నీ అహంకారాన్ని అలంకరించుకొంటున్నావు కాని అసలు నీ మనస్సు జ్ఞానం వైపుకు తిరిగిందా అదీ రామకృష్ణుడు చూసేవారు. ఆత్మజ్ఞానం లేకుండా కేవలం చదువు మాత్రమే ఉన్న వారికి రమణ మహర్షిగారు చదువుకొన్న మూర్ఖులు అని పేరు పెట్టారు. అంటే నీకు లోపల రీలైజేషన్ లేనప్పుడు నీకు ఎంత చదువు ఉన్నా కాని లోపల ఉన్న మూర్ఖత్వంలో నుండి బయటకు రాలేవు అని చెప్పటం. సర్వసాధారణంగా ధనవంతులకు లోపల ఎంతోకొంత గర్వం ఉంటుంది. అందుచేతనే ఏసుక్రీస్తు ఏమని చెప్పాడు అంటే ఒంటెను సూది బెజ్జంలోనుండి బయటకు లాగవచ్చునుగాని ఏ ధనవంతుడిని స్వర్గలోకంలోనికి పంపలేము అన్నాడు. ధనవంతులలో కూడా కొద్దిమంది మంచివారు, వినయవంతులు ఉండవచ్చు, అసలు ఉండరు అనికాదు, ఏసుక్రీస్తు జనరల్‌గా చెప్పాడు.

మనం ఎవరైనా పెద్దవారితో మాట్లాడేటప్పుడు మొఖం మీద మొఖంపెట్టి మాట్లాడకూడదు, ఒక ప్రక్కకు నిలబడి మాట్లాడాలి. అలాగే గుడికి వెళ్ళినప్పుడు దేవుడికి ఎదురుగా నిలబడకూడదు, ఒక ప్రక్కకు నిలబడి దర్శనం చేసుకోవాలి. ఒకసారి గురునానక్ గారు తూర్పు వైపుకు తిరిగి ధ్యానం చేసుకొంటున్నారు. అప్పుడు ఒక ధనవంతుడు వచ్చి ఆయనకు ఎదురుగా నిలబడ్డాడు. నానక్‌గారు కళ్ళు తెరిచిన వెంటనే మీకు ఏమి కావాలి అని ఈ ధనవంతుడు అడిగాడు. ఇది శీతాకాలం. ఎండ నా మీదపడటానికి ఇక్కడ కూర్చున్నాను. సూర్యకిరణాలు నా మీద పడకుండా ఇప్పుడు నువ్వు అడ్డునిలబడ్డావు. కాబట్టి అడ్డు తప్పుకో అదే నువ్వు నాకు చేసే సహాయం అని చెప్పారు. ఎదురుగా నిలబడటం అనేది అవినయానికి గుర్తు. ఆచార్యులవారు మహావిష్ణువు మీద స్తోత్రం వ్రాస్తూ ఒక మాట చెప్పారు. ఓ మహావిష్ణూ నా ముఖంలోగాని, నా మనస్సులోగాని ఎప్పుడూ అవినయం

లేకుండా చూడు అన్నారు. మనం విషయచింతన చేస్తున్నాము కాని ఆత్మచింతన చేయటంలేదు. గాలి వీస్తూ ఉంటే ఆకులు అటూ ఇటూ ఎలా కదులుతూ ఉంటాయో అలాగే విషయచింతన వచ్చేటప్పటికి మనస్సు అటూ ఇటూ కదులుతూ ఉంటుంది.

**ఊరూరు తిరుగక ఉల్లము నినుగని**

**అణగనీ ద్యుతి చూపుము అరుణాచలా**

ఆ ఊరు ఈ ఊరు అని, ఆ ఇల్లు ఈ ఇల్లు అని ఈ ప్రపంచాన్ని పట్టుకొని తిరుగుతున్నాము. కొంతమందికి రోజుకోమార్గం, రోజుకో గురువు అసలు స్థిరత్వం ఉండదు. ఒక మార్గం మీద వారికి విశ్వాసం ఉండదు. చపలత్వం ఎక్కువగా ఉంటుంది. ఇలా ప్రాపంచిక విషయాలలో తిరుగుతున్న మనస్సుకు నీ వైభవాన్ని చూపిస్తే మనస్సు అక్కడ అణిగిపోతుంది. ఈ ప్రపంచం నిజమా, అబద్ధమా అని అడిగితే రమణమహర్షిగారు నిజం అని చెప్పలేదు, అబద్ధమని చెప్పలేదు. నిజంలాగ కనిపిస్తోంది అన్నారు. నిజంలాగ కనిపిస్తోంది అంటే అది నిజంకాదు.

మీరు గిరి ప్రదక్షణ చేసేటప్పడు శాంతితరంగాలు, కాంతితరంగాలు, జ్ఞానతరంగాలు మిమ్మల్ని తాకుతూ ఉంటాయి. అది మీ కళ్ళకు కనబడదు, మీ చెవులకు వినబడదు. ఆయన జ్ఞాన స్వరూపుడు. అజ్ఞానంలో నిద్రపోతున్న మనలను శాంతి తరంగాలు తాకుతూ ఉంటాయి అంటే మన అజ్ఞానానికి నిప్ప పెట్టాడు. మనలో ఉన్న అజ్ఞానం కాలటానికి కొంతటైము పడుతుంది. అసలు అరుణాచలేశ్వరుడి మీద మనకు ప్రేమ కలిగింది అంటే తరువాత మనం వదులుకుందామన్నా ఆయన మనలను వదలడు. ఆయన స్వరూపం మనకు ఇచ్చే వరకు ప్రతీ జన్మలోను మనలను వెంటాడతాడు, వాడు గురువు. నువ్వు రాంగ్‌పాత్‌లో వెళుతున్నావు అనుకో, అప్పడు కూడా నిన్ను వదలకుండా నీకు అర్థమయ్యేలాగ చెప్పి నిన్ను రైట్‌పాత్‌లోనికి తీసుకొనివచ్చేవాడే నిజమైన గురువు. మనకు ఆ పని అరుణాచలేశ్వరుడు చేస్తున్నాడు. సాధనలో కొంతటైము పడుతుంది కాని మీకు అర్హతవచ్చినప్పడు కొన్ని క్షణాలలో ఆయన అనుగ్రహం వచ్చి మిమ్మల్ని ముంచేస్తుంది. అప్పడు మీరు భరించలేనంత ఆనందం వచ్చి మీ మీద పడుతుంది. అప్పడు మీరు ఆనందాన్ని అనుభవించటంకాదు, మీరే ఆనందం అయిపోతారు. అయితే ఇక్కడ అద్వైతానికి, ద్వైతానికి

పేచీ ఉంది.  ఆనందాన్ని ఎంజాయ్ చెయ్యాలంటే జీవలక్షణాలు ఉండాలి కదా, జీవుడు వేరుగా ఉండాలి కదా అని ద్వైతులు చెపుతూ ఉంటారు.  ఆనందం నీకు వచ్చినప్పడు దానిని ఎంజాయ్‌చెయ్యటానికి నీవు వేరుగా ఉండనక్కరలేదు, దానికి ద్వితీయం అక్కరలేదు. దానికి అదే నీకు అనుభవంలోనికి వస్తూ ఉంటుంది.

**నీవు నేను అణగ నిత్యఆనందమయముగ**

**నిలుచుస్థితి కరుణింపుము అరుణాచలా**

నేను అణిగిపోతాను, నువ్వుకూడా అణిగిపో.  నువ్వు దేవుడి వేషం వేసావు, నేను జీవుడి వేషం వేసాను.  ఈ దేవుడికి, జీవుడికి ఆధారంగా ఉన్నది ఒక్కటే.  నీ వేషం నువ్వు తీసేయి, నావేషం నేను తీసేస్తాను, ఈ వేషాలు తీసివేస్తే ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే.  నువ్వు వేరు, నేను వేరు అనే బేదబుద్ధి ఉన్నప్పడు ఏదో ఒకటి అడగాలి అనిపిస్తుంది.  ఉన్నది ఒక్కటే అయితే ఇంక అడిగేది ఏమీలేదు.  బేదబుద్ధి ఎప్పడైతే పోయిందో లోపల ఉన్న ఆనందం పొంగుతుంది.  అది స్వతంత్రమైన ఆనందం.  దానికి శరీరం యొక్క చావుతో సంబంధం లేదు, శరీరం చనిపోయినా ఆనందం కంటిన్యూ అయిపోతుంది.

నేను ఉన్నాను, ఆ ఉన్నదేదో తండ్రి లేనప్పడు సృష్టిలేనప్పడు కూడా ఉంది, ఆ ఉన్నదేదో నేనై ఉన్నాను, అదే సత్యం.  బైబిలులో ఎంత కరెక్టుగా చెప్పాడు ఏసు అని భగవాన్ ఈ వాక్యానికి ఆశ్చర్యపోయారు.  బుద్ధిమంతుడు అంటే నువ్వు ఏకాలంలో పుట్టినా, ఏ మతంలో ఉన్నా ఒక మంచి వాక్యం నీనోటి నుండి వచ్చినప్పడు దానిని ఎంజాయ్ చేస్తాడు కాని అలా ఎంజాయ్ చెయ్యకపోతే వాడు బుద్ధిమంతుడు కాదు.  పాము నోటిలో ఉన్న విషం పామును ఏమీ చేయదు.  అలాగే భగవంతుడిలో ఉన్న మాయ భగవంతుడిని ఏమీ చేయదు. భగవంతుడి దయ లేకుండా ఆయన మాయ మనకు దారి ఇవ్వదు.  ఆయన దయ ఉంటే మాయ మనకు దారి ఇస్తుంది, మనం ఆయనలో ఐక్యమవుతాము.  దేవుని దయ, ఆయన అనుగ్రహం సంపాదించటమే మన నిజమైన ఆస్థి.  మన మాట ద్వారా, మన చేత ద్వారా, మన ఆలోచన ద్వారా ఆయన దయ సంపాదించటానికి ప్రయత్నం చేయాలి.  మనకు ఏదైనా భగవంతుడు ఇస్తేనే వస్తుంది లేకపోతే ఏమీరాదు.  కాని భగవంతుడు ఇచ్చింది మన సొంతం అనుకొంటున్నాము.  మనకు సొంతం అంటూ ఈ సృష్టిలో ఏమీ లేదు.

**గిరి రూపమైనట్టి కరుణాసముద్రమా**

**కృపచేసి నన్ను ఏలుము అరుణాచలా**

నువ్వు రాళ్ళగుట్ట కింద కనిపిస్తున్నావు, కొండలాగ కనిపిస్తున్నావుకాని నువ్వు దయా సముద్రుడవు, నువ్వు కరుణాసముద్రుడవు. మీకు ఉన్న అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞానం వైపుకు మీ కళ్ళు తెరిపించటం కోసం శివుడి యొక్క అనుగ్రహమే ఈ రూపం ధరించింది. ఓ అరుణాచలేశ్వరుడా! నువ్వే నాకు యజమానివి. అందుచేత నాయందు దయ చూపించి నన్ను రూల్ చెయ్యి, నీలో ఐక్యం చేసుకో.

**అడుగకిచ్చెడు నీదు అకళంకమగుకీర్తి**

**హాని చేయకబ్రోవుము అరుణాచలా**

ఎవరిచేత ఏమీ అడిగించుకోకుండా వారికి ఏది అవసరమో అది ఇస్తావనే గౌరవం నీకు ఉంది. ఇప్పడు నాచేత అడిగించుకొని కాని ఇవ్వవు అనుకో నీ గౌరవానికే భంగం. నీ కీర్తికి భంగం రాకుండా నన్ను అనుగ్రహించు. నీదయ కావాలి అని మనం భగవంతుడిని అడుగుతాము. అలా అడగనక్కరలేదు. ఆయన అనుగ్రహం ఎప్పడూ ఉంది కాని అది మీకు రివీల్ అవ్వదు, మామిడిపండు ముగ్గిన వెంటనే చెట్టు నుండి ఎలా రాలిపోతుందో అలాగే మీకు బాగా మెచ్యూరిటీ వచ్చినప్పడు ఒక్క క్షణం కూడా వెయిట్ చేయకుండా అది మీకు రివీల్ అవుతుంది. అదే మీకడసారి జన్మ, ఇంక మీరు శవాలను మోయనక్కరలేదు. అరుణాచలం గొప్పతనం ఏమిటి అంటే మీకు పెద్ద సఫరింగ్ లేకుండా, ఒకవేళ సఫరింగ్ ఉన్నా మనకు మత్తుపెట్టి ఆ సఫరింగ్ తెలియకుండా చేసి మనలను గమ్యానికి తీసుకొనిపోతాడు. అంటే సాధన పేరుమీద మనలను ఎక్కువ సఫరింగ్‌కు గురిచెయ్యడు. మరుగుపడిపోతున్న జ్ఞానమార్గాన్ని ఆవిష్కరించటానికి వచ్చిన అవతారమే రమణావతారం. ఆయన గిరిరూపంలో ఉన్నాడు, రమణుడు గురురూపంలో ఉన్నాడు. ఊరికే రూపాలు తేడా గాని ఉన్నది ఒక్కటే. ఇంతవరకు మనం పొట్ట వెళ్ళే విద్యలు నేర్చుకుంటున్నాము. అరుణాచలేశ్వరుడు మనకు ఆత్మవిద్యను నేర్పుతున్నాడు. మీ జీవితాలు అన్నీ ఆత్మజ్ఞానం వైపుకు మళ్ళే అవకాశం ఉంది. ఇప్పడు ఈ మహాదీపాన్ని దర్శించి అందరూ ధన్యులు అవ్వాలని నేను ఆశిస్తున్నాను.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| ఫిబ్రవరి | 11 | పాతాళ మెరక |
| ఫిబ్రవరి | 20 | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం (శివరాత్రి) |

దిII **11-02-2012** శనివారం ఉII గంII **8-48** నిIIలకు **పాతాళమెరక**లోని

**శ్రీ పార్వతీ సమేత విశ్వేశ్వర స్వామివార్ల నూతన ఆలయ శివలింగ ప్రతిష్ఠ**

మరియు మII గంII **3-50** నిIIలకు

**సద్గురు శ్రీ జిన్నూరు నాన్నగారు వృద్ధాశ్రమం** ప్రారంభోత్సవము.

**విందు :** సాII గంII **6-00**ల నుండి.

పై కార్యక్రమములు **సద్గురు శ్రీ నాన్నగారి** సమక్షములో జరుగును.

# శాంతి స్వరూపం

కేవలం ఉన్నదే ఆత్మ. అది అనంతం. ఆత్మ స్వరూపం సచ్చిదానందం. అది సిద్ధ వస్తువే! సాధ్య వస్తువు కాదు! అట్టి ఆత్మయే నీవు! నీ స్వరూపం శాంతే! ఆనందమే! 'నీవు సచ్చిదానంద స్వరూపుడవే'- అంటారు భగవాన్ శ్రీరమణమహర్షి. శాంతి స్వరూపం కాబట్టి అది నాకన్న భిన్నముగా నాచేత పొందబడేది కాదు మరియు పోగొట్టుకోబడేది కాదు. శాంతి దేశకాలాలలోనూ, బాహ్యప్రపంచములోనూ, విషయాలలోనూ దొరకదు. ధనము, పదవి, ప్రాపంచిక సౌఖ్యాలు మున్నగునవి శాంతిని ప్రసాదించలేవు. 'మూల - తలంపే' మనకు 'నేను'గా వ్యక్తం అవుతోంది. అదే మనస్సు. అవిద్యావరణ రూపంలో దేహాత్మబుద్ధే మన స్వరూపాన్ని మరుగుపరచి, స్వరూపశాంతిని మనకు అందకుండా చేస్తోంది. 'నేను-నాది' అను భావనా రూపంలో వ్యక్తమయ్యే దేహాత్మబుద్ధి వలన సకల అరిష్టాలకు, జన్మపరంపరలకు, దుఃఖానికి, అశాంతికి లోనవుతున్నాం. మనస్సును అంతర్ముఖం చేసి, హృదయంలో ఎరుకతో లయం చేసి, అద్వైతానుభూతిని పొందితే, పరమశాంతే 'నేను'గా వ్యక్తం అవుతుంది. స్వరూప జ్ఞానం 'దేహమే - నేను' అనెడి అజ్ఞానాన్ని అంతం చేసి, కేవలం ఉన్న సత్వదార్థమే 'నేను' అనెడి అద్వైతానుభూతిని కలిగిస్తుంది. అట్టి ఆత్మజ్ఞానానికి సాటియైన, పవిత్రమైన వస్తువు ఈ సృష్టిలో లేనే లేదు. అమృతత్వాన్ని పొందుటకు ఆత్మజ్ఞానం తప్ప వేరు మార్గం లేదు. అట్టి ఆత్మజ్ఞానాన్ని మనకు బోధించి, స్వరూప శాంతిలోకి మేల్కొలిపే గురువుకు మనం ఎంతో ఋణపడి ఉంటాం.

**- చావలి సూర్యనారాయణమూర్తి, టీచర్, అమలాపురం**

# అవగాహన ద్వారానే మనస్సు మరణిస్తుంది

మనం విషం తీసుకుంటే మరణిస్తాము. అర్థం చేసుకోవటమే మనస్సుకు విషంలాంటిది. దానికి మనస్సు చాలా వ్యతిరేకిస్తుంది. అలా అర్థం చేసుకోకుండా ఉండటానికి ప్రయత్నిస్తుంది. వ్యతిరేకిస్తుంది. అనుమానాలను సృష్టిస్తుంది. సత్యం అంటే దానికి కిట్టదు. అది మాయల దెయ్యం. అది తన్ను తాను రక్షించుకొంటుంది. ఎందుకంటే అవగాహన ద్వారా అది పత్తా లేకుండా పోతుంది. మన దుఃఖాలకు మనమే కారణమని గురు వాక్యం ద్వారా తెలుసుకుంటాము. కాని సమాధానపడనియ్యదు. కర్త మనమని అనుకొంటాము. ఎవరినో బాధ్యులనుగా నిందించివే చేస్తుంది. మనస్సును అధికమించటం ఎలా అని మనమే మరలా తలపోస్తాము. సమాధి ఎలా సాధ్యమని అనుకొంటాము. ఈ ప్రశ్న ఎంతో దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. సమాధి స్థితికి ఇంకా నేను చేరుకోలేదని వాపోతాము. దీనితో కొత్త దుఃఖాలను సృష్టించుకొంటాము. జ్ఞానోదయం కోరే విషయం అయితే అది కూడా అర్థరహితమౌతుంది. "ఏ కోరికా లేకపోతే మీరే జ్ఞానులు అవుతారు" అంటారు అనుభవజ్ఞులు. కోరికే దుఃఖం చుట్టూ తిరుగుతుంది. పతంజలి మనస్సును ఐదురూపాలుగా పేర్కొన్నారు. "వాస్తవజ్ఞానం, అవాస్తవజ్ఞానం, కల్పన, నిద్ర, జ్ఞానము" అని. మనస్సు అందరికీ ఉంటుంది. దాన్ని శత్రువుగాను, మిత్రునిగాను మలచుకోవచ్చు పనిముట్టుగా చేసుకొంటే అది బానిస అవుతుంది. అది మార్గమౌతుంది. తద్ద్వారా మన లక్ష్యాన్ని చేరుకోవచ్చు. పిచ్చి ఆసుపత్రిలో పిచ్చివాడు, బుద్ధుడు మనస్సును వాడారు. బుద్ధుని మనస్సు మాయమైన స్థితిని సాధించాడు. పిచ్చివాడి మనస్సు చెదిరిపోయి ఉంటుంది. దుఃఖసాగరంలో మునిగి ఉంటాడు. నవ్వుతాడు - ఏడుస్తాడు. మనం అనేక జన్మలనుంచి మనస్సును తప్పగా ఉపయోగించుకొన్నాము. అందుకే అది అతిథిగా మారిపోయింది. మనం దానికి బానిసలమై ఆ నీడను అనుసరించి పయనిస్తున్నాము. దాన్ని ఆగు అని శాసించలేకపోతున్నాము. అదే అనేక కల్పనలతో మనలను శాసిస్తుంది. మన శరీర అవయవాలను ఆగు అంటే ఆగిపోతున్నాయి కాని మనస్సును శాసించలేకపోతున్నాము. మనం ఏ ఆలోచనా చెయ్యకూడదు అనుకొన్నా ఆలోచిస్తూనే ఉంటాము. పడకపై వాలినా ఆలోచిస్తాము. కారణం దానికి అధికారం ఇచ్చాము. అది నిరంకుశంగా మారింది. బుద్ధుడు, రమణుడు అద్దంలా మారారు. అద్దం ముందు మనం ఉంటే మన ప్రతిబింబం నిలుస్తుంది. తప్పకుంటే ఏమీ లేదు. అద్దం ముందు ఏ వ్యక్తులైనా వెళితే వారి రూపలావణ్యాలను, గుణగణాలను మర్చిపోవాలన్నా మనస్సు మరువనియ్యదు. మనస్సు మనపై చేసే స్వారీని ఆపాలి. అప్పుడు అది విశ్రాంతిలో ఉంటుంది. మన అనుమతికోసం ఎదురుచూస్తుంది. మనలను నియంత్రించాలని ప్రయత్నించదు. మనం దైవచింతనలో, అధ్యయనంలో ఉంటే దాని ఆటలు సాగవు. కాని ఆ పరిస్థితికి భిన్నంగా ఉన్నాము. బయటకు వెళ్ళినప్పుడు చెప్పలు వాడతాము ఇంటికి రాగానే బయట వదులుతాము అలాగే అవసరం ఉన్నప్పుడే మనస్సును వాడాలి. నిరంతరం సాధకుడు దానితో కాపురం చెయ్యకూడదు. అలాగని దాన్ని బలవంతం చెయ్యకూడదు. దాని పోకడలను గమనించాలి, దానికి గురు అనుగ్రహంతోడైతే సునాయాసంగా గమ్యాన్ని చేరవచ్చును.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం